క్లుప్తంగా

వికసించిన మే పుష్పం



మొయినాబాద్‌: సాధారణంగా చాలా రకాల పుష్పాలు ఎప్పుడు వికసిస్తూనే ఉంటాయి. కాని కొన్ని అరుదైన పుష్పాలు మాత్రం సంవత్సరంలో ఒకసారి మాత్రమే వికసిస్తూ కనువిందు కలిగిస్తుంటాయి. అలాంటిదే మే పుష్పం. మే నెలలో మాత్రమే వికసించే అరుదైన మే పుష్పం మొయినాబాద్‌ మండలం పెద్దమంగళారంలో చేగూరి సుధాకర్‌గౌడ్‌ ఇంట్లో సోమవారం రాత్రి వికసించింది. సన్నని రేకులతో వికసించి కనువిందు చేసింది.

ఎస్సీ సెల్‌ కమిటీల నియామకాలు చెల్లవు

కొత్తూరు: తనకు సమాచారం లేకుండా షాద్‌నగర్‌ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్‌ ఎస్సీసెల్‌ మండల, గ్రామ కమిటీల నియామకాలు చెల్లవని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కర్రొళ్ల సురేందర్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో కొత్తగా చేరిన వారు తనకు సమాచారం ఇవ్వకుండానే ఇటీవల మండల, గ్రామ కమిటీలను వేశారని వివరించారు. కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీసెల్‌ షాద్‌నగర్‌ నియోజకవర్గ అధ్యక్షుడిగా దళిత వ్యక్తిని ఉన్నందుకే కొందరు తనను అవమానించాలనే కుట్రతో కమిటీలను వేస్తున్నట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తులపై రాష్ట్ర కమిటీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

భరోసా సభను విజయవంతం చేయండి

బీఎస్పీ నాయకుడు శ్రీశైలం



వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీశైలం

షాబాద్‌: ఈ నెల 7న హైదరాబాద్‌లోని సరూర్‌ నగర్‌ గ్రౌండ్‌లో నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ చేవెళ్ల నియోజకవర్గం ఉపాధ్యక్షుడు కర్రె శ్రీశైలం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంబేడ్కర్‌ విగ్రహం వద్ద భరోసా సభకు సంబంధించిన వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు భరోసా ఇవ్వడానికి ఉత్తరప్రదేశ్‌ మాజీ ముఖ్యమంత్రి బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి వస్తున్నారని చెప్పారు. ఈ సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మున్నూరు కాపు శ్రీనివాస్‌, ప్రదీప్‌, మహేందర్‌,యాదయ్య, నవీన్‌కుమార్‌, నర్సింహులు, శ్రీనివాస్‌, మల్లేష్‌, చందు తదితరులున్నారు.

గ్రామాల్లో బాలరక్షక కమిటీల ఏర్పాటు

తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో పాల్గొన్న విశాల

కేశంపేట: గ్రామాల్లో బాలకమిటీల ఏర్పాటుతో బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన అదుపులో ఉంటుందని స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్‌ కమిటీ జిల్లా చైర్‌పర్సన్‌ విశాల అన్నారు. మంగళవారం స్త్రీ శిశు సంక్షేమంపై జిల్లా స్టాండింగ్‌ కమిటీ సమావేశం హైదరాబాద్‌లోని జిల్లా పరిషత్‌ కార్యాలయంలో జరిగింది. అలాగే, స్త్రీశిశు సంక్షేమశాఖతో పాటు దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రం కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని సీఎం కేసీఆర్‌ ప్రకటించారని అన్నారు. చిన్నారులకు సన్నబియ్యం పంపిణీ అభినందనీయమని ఆమె చెప్పారు. జిల్లాలో రూ.10 లక్షలతో రిహబిలిటేషన్‌ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్‌, డిప్యూటీ సీఈఓ రంగారావు, పీడీ మోతీ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొందుర్గు: కొందుర్గు గాడిబావి కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మంటపారాధన, నవగ్రహ రుద్రహోమం, ధాన్యధి వాసం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్‌ నేత శంకర్‌, స్థానిక నాయకులు, భక్తులు హాజరై పూజలు చేశారు.

రోడ్లతోనే గ్రామాలు అభివృద్ధి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌

- రూ.3.10 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నందిగామ: బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ: రోడ్లు బాగుంటేనే గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయని, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ అన్నారు. మండల కేంద్రమైన నందిగామ నుంచి నర్సప్పగూడ వెళ్లే రహదారికి బీటీ రోడ్డు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉందని చెప్పారు. గత ప్రభుత్వాలు చేయలేని ఎన్నో అభివృద్ధి పనులను బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. గోతులమయంగా మారిన నర్సప్పగూడ రోడ్డు సుమారు 4 కిలో మీటర్ల మేరకు రీబీటీతో పాటు గ్రామ సమీపంలో టుపాయికుంట వద్ద బ్రిడ్జీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు గోవిందు అశోక్‌, జెట్ట కుమార్‌, ఉప సర్పంచ్‌లు మెక్కొండ కుమార్‌, శేఖర్‌, ఎంపీటీసీలు చంద్రపాల్‌ రెడ్డి, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్‌, మాజీ పీఏసీఎస్‌ చైర్మన్‌ విఠల్‌, ఏఎంసీ డైరెక్టర్‌ యాదగిరిగౌడ్‌, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నారాయణరెడ్డి, నాయకులు కుమార్‌, చించేటి కృష్ణ, రాజేందర్‌, యాదగిరి, గోవిందు శేఖర్‌, తుమ్మల నర్సింహా, వార్డు సభ్యులు కొండన్నగూడ సత్యం, మెండే కృష్ణయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

40 ఫీట్ల మేర విస్తరించాలి

మండల కేంద్రమైన నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లే రహదారిని 40 ఫీట్ల మేరకు విస్తరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు జిలెల్ల బాల్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 33 ఫీట్లు ఉండాల్సిన రోడ్డు కేవలం 15 నుంచి 20 ఫీట్ల వరకు మాత్రమే ఉందని, దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. మిగతా 7 ఫీట్లు రోడ్డుకు ఇరువైపుల ఉన్న రైతులతో మాట్లాడి వారి అంగీకారంతో విస్తరించినట్లయితే ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందని వివరించారు.

బాల్యానికి పునాది అంగన్‌వాడీ

షాద్‌నగర్‌రూరల్‌: చిన్నారుల బాల్యానికి అంగన్‌వాడీ కేంద్రాలలోనే పునాది పడుతుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్‌ సమావేశ మందిరంలో ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో ఏర్లీ చైల్డ్‌ కేర్‌ అండ్‌ ఎడ్యుకేషన్‌(ఈసీసీఈ డే)కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ హాజరై మాట్లాడుతూ.. చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. చిన్నారులకు పసితనం నుంచి పౌష్టికాహారాన్ని అందిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని చెప్పారు. చిన్నారుల అక్షరాభ్యాసం అంగన్‌వాడీలోనే ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులకు స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భీష్వకిష్టయ్య, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ఈట గణేష్‌, విశాల, ఎంపీడీఓ వినయ్‌కుమార్‌, సీడీపీఓ నాగమణి పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటే లక్ష్యం

షాద్‌నగర్‌రూరల్‌: ప్రజలకు కావాల్సిన అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4 వార్డుల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్‌ పరిధిలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, అంతర్గ మురుగు కాలువలు, వీధిదీపాల ఏర్పాటు, మిషన్‌ భగీరథలో భాగంగా ఇంటింటికి నల్లా కనెక్షన్‌ వంటి అభివృద్ధి పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్‌ గణేష్‌, మున్సిపల్‌ చైర్మన్‌ నరేందర్‌, వైస్‌ చైర్మన్‌ ఎంఎస్‌.నటరాజ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ వెంకన్న, కౌన్సిలర్లు రాయికల్‌ శ్రీనివాస్‌, శ్రీనివాస్‌గౌడ్‌, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లేడ్‌చౌదరిగూడ మండలం చింతకుంట తండాకు చెందిన వివిధ పార్టీ నాయకులు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

యుద్ధ విద్యలతో ఆత్మస్థైర్యం

స్కూల్‌ స్పోర్ట్స్‌ కరాటే అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య



కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో చెన్నయ్య

షాద్‌నగర్‌: యుద్ధ విద్యలతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని స్కూల్‌ స్పోర్ట్స్‌ కరాటే అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య అన్నారు. షాద్‌నగర్‌ శివారులోని నూర్‌ ఇంజనీరింగ్‌ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్‌ గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం జపాన్‌ కరాటే అసోసియేషన్‌ ఇండియా షోటోఖాన్‌ వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు కరాటేలో బెల్ట్‌ గ్రేడింగ్‌ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మమత, స్వప్న, శశిరేఖ, విజయలక్ష్మి, ప్రియాంక, ఇందు, దివ్య, గీత, అంకిత, రేవతిలు ప్రతిభను కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, ధృవ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. విద్యార్థులందరు కరాటే, జూడో, కుంగ్‌ఫూ వంటి యుద్ధ విద్యలను నేర్చుకోవాలన్నారు. ఆపద సమయంలో తనును తాను రక్షించుకోనేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. చైనా, జపాన్‌ వంటి దేశాల్లో యుద్ధ విద్యలను విద్యార్థులకు విధిగా నేర్పిస్తారని అన్నారు. మన దేశంలో కూడా ప్రభుత్వం యుద్ధ విద్యలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

పార్లమెంట్‌ ప్రభారీ చంద్రశేఖర్‌



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌

షాద్‌నగర్‌: క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ పార్లమెంట్‌ ప్రభారీ వీరెల్లి చంద్రశేఖర్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో బీజేపీని బలోపేతం చేసి, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకూ ప్రచారం చేయాలని సూచించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు సమయం కేటాయించి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తగిన విధంగా కృషి చేయాలని అన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని, ఈ పాలనకు చరమగీతం పాడే వరకు పోరాటం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, డాక్టర్‌ విజయ్‌కుమార్‌, అందెబాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహ్మగౌడ్‌, భూపాలాచారి, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్‌, మహేందర్‌రెడ్డి, కుర్మయ్య,మణికంత, శేఖర్‌, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి



షాద్‌నగర్‌రూరల్‌: ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు

షాద్‌నగర్‌రూరల్‌: జూనియర్‌ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జూనియర్‌ పంచాయతీ ఫెడరేషన్‌ అధ్యక్షుడు శ్రీరాం అన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మండల పరిషత్‌ కార్యాలయం నుంచి పట్టణ ముఖ్యకూడలి వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. శ్రీరాం మా ట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేస్తూ ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన స్వచ్ఛ కార్యక్రమాలకు జాతీయ, రాష్ట్రస్థాయిలో అవార్డులు లభించాయన్నారు.

మీ డిమాండ్లు తప్పక నెరవేరుతాయి: ఎమ్మెల్యే

మీ డిమాండ్లు తప్పకుండా నెరవేరుతాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ అన్నారు. మంగళవారం సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగానే ఉందన్నారు. ప్రభుత్వ ప్రకటన వచ్చే వరకు ఓపిక పట్టాలని సూచించారు. కార్యక్రమంలో యాదయ్య, రవీందర్‌, శ్రీనివాస్‌, వెంకటేశ్‌, జగదీశ్‌, ప్రమోద్‌, రామకృష్ణ, వినోద్‌, సరిత పాల్గొన్నారు.

మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి

చేవెళ్ల: జూనియర్‌ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్‌, శేఖర్‌లు కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. గ్రామాలాభివృద్ధిలో జూనియర్‌ పంచాయతీ కార్యదర్శి పాత్ర చాలా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. సీఎం కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులను రెగ్యులర్‌ చేస్తున్నామని తొలి సంతకం చేశారని, తమకూడా రెగ్యులర్‌ చేయాలన్నారు. కార్యక్రమంలో జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్‌ కార్యదర్శులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ సంరక్షణపై దృష్టి సారించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ జయలక్ష్మి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

షాద్‌నగర్‌: తల్లి, బిడ్డల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ జయలక్ష్మి, ఆశ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ జయలక్ష్మి మాట్లాడుతూ... ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి గర్భవతులను గుర్తించి వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని, ప్రభుత్వం అందించే ప్రోత్సహకాలను ప్రజలకు వివరించాలన్నారు. గర్భవతులను ఎప్పటికప్పుడు ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్యులతో పరీక్షలు చేయించాలన్నారు. అదేవిధంగా చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు, వ్యాక్సినేషన్‌ చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి అయి ఇంటికి వచ్చిన బాలింతలను ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యం గురించి వాకబు చేస్తూ ఉండాలని అన్నారు. తల్లి, బిడ్డల సంరక్షణ కోసం ఆశ కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెల్త్‌ ఎడ్యుకేటర్‌ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు విద్యుల్లత, మెర్లిన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ

సీఐ ప్రసన్న కుమార్‌



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రసన్నకుమార్‌

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరు క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఐ ప్రసన్న కుమార్‌ పేర్కొన్నారు. శంకర్‌పల్లి అరుణోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో శంకర్‌పల్లికి చెందిన కీ.శే దండుగుల యాదయ్య స్మారకార్థం నిర్వహించిన బ్యాడ్మింటన్‌ (షటిల్‌)టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి సింగాపురం గ్రామానికి చెందిన రాంరెడ్డి, తిరుపతి, ద్వితీయ బహుమతి బుల్కాపురానికి చెందిన కృష్ణ, మల్లేశంలు గెలుపొందారు. అనంతరం క్రీడాకారులను సీఐ సన్మానించారు. కార్యక్రమంలో అరుణోదయ యువజన సంఘం అధ్యక్షుడు ధర్‌గౌడ్‌, కౌన్సిలర్‌ శ్రీనాథ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌

కొందుర్గు: కొందుర్గు లక్ష్మీనరసింహాస్వామి దేవాలయం ఈఓగా శ్రీనివాస్‌ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఈఓగా పనిచేస్తున్న నరేందర్‌ శంషాబాద్‌ చెన్న బసవేశ్వర మఠం ఈఓగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా చేవెళ్ల వేంకటేశ్వరస్వామి దేవాలయం ఈఓగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవాలయ కమిషనర్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోపణలు అవాస్తవం

సర్పంచ్‌ విష్ణువర్ధన్‌రెడ్డి



కేశంపేట: గ్రామానికి చెందిన కొందరు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండలంలోని పాపిరెడ్డిగూడ సర్పంచ్‌ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గ్రామంలో తన అనుచరులకు ఇంటి నిర్మా ణం కోసం పాఠశాల స్థలం ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారని చెప్పారు. గ్రామంలో తన అనుచరులకు ఎలాంటి స్థలం ఇవ్వలేదని ఆయన వివరణ ఇచ్చారు. గ్రామంలో భజన మండలి సభ్యులు తమ సామాన్లు భద్రపరుచుకునేందుకు స్థలం కావాలని అడిగితే గ్రామ కంఠంలోని స్థలం నుంచి 40 గజాల స్థలం మాత్రమే ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామస్తుల అభిప్రాయం మేరకు మినిట్స్‌ బుక్‌లో ఎంట్రీ చేసిన తరువాత భజన మండలికి స్థలం ఇవ్వడం జరిగిందని తెలిపారు.

నీటి ఎద్దడి పరిష్కారానికి చర్యలు

జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

బొంరాస్‌పేట: నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీటీసీ సభ్యురాలు అరుణదేశు చౌహాన్‌ అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని టేకులగడ్డ తండాలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు వేయించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ.. రూ.2లక్షల జెడ్పీ నిధులతో ఈ పనులు చేపట్టామన్నారు. ఆమె వెంట ఎంపీపీ హేమీబాయి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీబాయి, సర్పంచ్‌ శంకర్‌నాయక్‌, దేశ్యానాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ సరఫరా చేయాలి

భారతీయ కిసాన్‌ సంఘ్‌ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి



నిరసన తెలుపుతున్న సత్యనారాయణరెడ్డి

షాబాద్‌: రైతులకు విద్యుత్‌ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ సరఫరా చేయాలని భారతీయ కిసాన్‌ సంఘ్‌ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి మంగళవారం విద్యుత్‌ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో భారతీయ కిసాన్‌ సంఘ్‌ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌, రెవెన్యూ, మార్కెటింగ్‌ సమస్యలపై విధివిధానాలు ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రైతులు పార్టీలకు అతీతంగా భారతీయ కిసాన్‌ సంఘ్‌ సమావేశాలకు హాజరు కావాలని సూచించారు. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు విరేశం, చంద్రబాబు, భీమయ్య, కృష్ణ, రమేశ్‌, అంజయ్య, వెంకటయ్య తదితరులున్నారు.

ధ్యానంతో మానసిక అలసట దూరం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న నవీన్‌

కొందుర్గు: ధ్యానంతో మానసిక అలసట దూరమవుతుందని పిరమిడ్‌ స్పిరిచువల్‌ సొసైటీ ధ్యాన ప్రచారకర్త నవీన్‌ అన్నారు. మంగళవారం చలివేంద్రంపల్లిలో ఉపాధిహామీ కూలీలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానంతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. నిత్య జీవితంలో అనేక సమస్యలతో సతమతమవుతూ.. ఒత్తిడికి గురయ్యే వారికి ధ్యానం ఎంతో ఉపరిస్తుందన్నారు. ధ్యానం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయన్నారు. ప్రతిఒక్కరూ ధ్యానం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి, సభ్యులు బాలకృష్ణారెడ్డి, తిరుపతయ్య, వెంకటలక్ష్మి, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం



షాద్‌నగర్‌: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన నరేందర్‌

మున్సిపల్‌ చైర్మన్‌ నరేందర్‌

షాద్‌నగర్‌: నిరుపేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మున్సిపల్‌ చైర్మన్‌ కొందూటి నరేందర్‌ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌ పట్టణంలోని 22వ వార్డు రతన్‌కాలనీలో అంగన్‌వాడీ పాఠశాల ఆవరణలో కౌన్సిలర్‌ నడికూడ సరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని నరేందర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానవ శరీరంలో కళ్లు ఎంతో ప్రధానమైనవని అన్నారు. కంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిరుపేదలను దృష్టి ఉంచుకొని కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరికి శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటుగా అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలు తీవ్రంగా ఉంటే అలాంటి వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని సరోజని ఆసుపత్రికి రెఫర్‌ చేస్తున్నట్లు తెలిపారు. నడికూడ యాదగిరి యాదవ్‌, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'తో పేదలకు లబ్ధి

షాబాద్‌: కంటి వెలుగును పేదలు సద్వినియోగం చేసుకోవాలని ముద్దెంగూడ ఉపసర్పంచ్‌ సామ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రోనిగూడలో కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలకు వైద్య సేవలు అందించేందుకు ఈ పథకం రూపుదిద్దుకుందన్నారు. అంగన్‌వాడీ టీచర్‌ శకుంతల, వైద్య సిబ్బంది గోపాల్‌, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, తదితరులున్నారు.

దృష్టి సమస్యలకు చెక్‌

మొయినాబాద్‌రూరల్‌: కంటి వెలుగు కార్యక్రమంతో దృష్టి సమస్యలకు చెక్‌పడనుందని సర్పంచ్‌ స్వప్న అన్నారు. మంగళవారం నక్కలపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం అంధత్వాన్ని పారదోలేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కంటి వెలుగు రూపుదిద్దుకుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కంటి వెలుగు వైద్యులు పాల్గొన్నారు.

కార్ల ర్యాలీని విజయవంతం చేయండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

శంకర్‌పల్లి: ఈ నెల 5వ తేదీన బుద్ధ గౌతమ బుద్ధ జయంతి పురస్కరించుకొని బుద్ధవనం కార్ల ర్యాలీని విజయవంతం చేయాలని బిఎస్‌ఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ అశోక్‌ పేర్కొన్నారు. మంగళవారం శంకర్‌పల్లి అంబేడ్కర్‌ భవనంలో చలో బుద్ధవనం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ 125అడుగుల విగ్రహం నుంచి నాగార్జున సాగర్‌లోని బుద్ధవనం వరకు 200 కార్లతో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. బుద్ధవనంలో బుద్ధపూజ, ధమ్మబుద్ధ ప్రవచనం, ధమ్మ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై కార్యక్రమాన్ని విజయవంత చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌ యువజన సంఘం సభ్యులు రాములు, రాంచందర్‌, నగేశ్‌, లక్ష్మయ్య, నర్సింలు, శంకర, గండయ్య, శ్రీనివాస్‌, ప్రవీణ్‌, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.